క్లుప్తంగా

కొత్త వరి విత్తనాల పంపిణీ



రైతులకు వరి విత్తనాలు అందజేస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు

తాళ్లపూడి: వరి దిగుబడులు పెంచే విధంగా పరిశోధనలు జరుగుతున్నాయని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త, కో ఆర్డినేటర్ డాక్టర్ చల్లా వెంకట నరసింహం తెలిపారు. ఇందులో భాగంగానే ఈ ఖరీఫ్‌లో ప్రయోగాత్మకంగా సాగు చేయడానికి రైతులకు ఆరు కొత్త వరి వంగడాలు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. మండలంలోని వేగేశ్వరపురం రైతుభరోసా కేంద్రం (ఆర్‌బీకే) వద్ద నూతన వరి విత్తనాలను ఎంపిక చేసిన రైతులకు సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నరసింహరావు మాట్లాడుతూ, ఈ ఖరీఫ్‌లో ఎంటీయూ–1271, 1275, 1310, బీపీటీ–3082, 2858, 2841 రకాల వరి వంగడాలను కొత్త ప్రవేశపెట్టామని తెలిపారు. ఎంపిక చేసిన రైతుల పొలాల్లో ఈ విత్తనాలను సాగు చేసి, పంట దిగుబడి, నాణ్యత, చీడపీడలు తట్టుకునే సామర్థ్యం వంటి వాటిని పరీక్షిస్తామని వివరించారు. రైతులు సకాలంలో నారుమడి వేసుకోవడానికి విత్తనాలు అందజేశామన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.హైమజ్యోతి, మండల వ్యవసాయాధికారి జి.రుచిత పాల్గొన్నారు.

క్షతగాత్రులకు ఆర్థిక సాయం



క్షతగాత్రుడు పార్థుకు ఆర్థిక సాయం అందజేస్తున్న సింగరాజుపాలెం యువత

నల్లజర్ల: వేర్వేరు ప్రమాదాల్లో గాయపడిన మండలంలోని సింగరాజుపాలేనికి చెందిన ఇద్దరికి ఆ గ్రామ యువకులు దొండపాటి పార్థు ఆధ్వర్యంలో సోమవారం ఆర్థిక సహాయం చేశారు. తాటి చెట్టుపై నుంచి కింద పడి తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్న పడమట కొండబాబుకు రూ.17,500 ఆర్థిక సాయం చేశారు. అలాగే బైక్ యాక్సిడెంట్‌లో చేతికి ఫ్రాక్చర్ అయిన మద్దాల పార్థుకు రూ.20 వేల సాయం అందించారు.

పెరవలిలో అన్న సమారాధన

పెరవలి: స్థానిక అభయాంజనేయ స్వామి వారి జయంతి ఉత్సవాల సందర్భంగా సోమవారం భారీ ఎత్తున అన్న సమారాధన నిర్వహించారు. స్వామి వారికి విశేష పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు అన్న సమారాధన చేశారు. ఈ అన్న సమారాధనకు పెరవలి, నల్లాకులవారిపాలెం, కొత్తపల్లి అగ్రహారం, కాపవరం, అజ్జరం, కాకరపర్రు, ముక్కామల తదితర గ్రామాల నుంచి సుమారు తొమ్మిది వేల మంది భక్తులు హాజరయ్యారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ అన్ని చర్యలూ తీసుకుంది.

కొవ్వూరు మండల పరిషత్ పాలకవర్గ సమావేశం

కొవ్వూరు: మండల పరిషత్ పాలకవర్గ సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ కాకర్ల సత్యనారాయణ (నారాయుడు) అధ్యక్షతన సోమవారం కొవ్వూరులో నిర్వహించారు. పంచాయతీరాజ్ చట్టం–1994, ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అనుసరించి ఈ సమావేశం నిర్వహించామని ఎంపీడీవో కె.సుశీల పేర్కొన్నారు. ఎన్నికల షెడ్యూల్ అమలులో ఉన్నందున సమావేశంలో విధాన పరమైన నిర్ణయాలు తీసుకోలేదు. ఎన్నికల మార్గదర్శకాలు, షరతులకు లోబడి సమావేశం జరిగింది. జెడ్పీటీసీ సభ్యురాలు బొంత వెంకటలక్ష్మి, వైస్ చైర్మన్ వీరమళ్ల నారాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఫలితాలపై పల్లెల్లో ఉత్కంఠ

నిడదవోలు రూరల్: సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడేందుకు మరికొద్ది గంటల సమయం మాత్రమే ఉంది. దీంతో నిడదవోలు మండలంలోని పల్లెల్లో వైఎస్సార్ సీపీ, కూటమి నాయకుల్లో ఫలితాలపై ఉత్కంఠ నెలకొంది. పోలింగ్ పూర్తయిన నాటి నుంచి అభ్యర్థులు, పార్టీల గెలుపు, ఓటములపై పందేల జోరు కొనసాగుతానే ఉంది. గ్రామాల వారీగా సాధించే ఓట్లపై కూడా పందేలు వేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జి.శ్రీనివాస్‌నాయుడు మళ్లీ రెండోసారి ఘన విజయం సాధిస్తారని పార్టీ శ్రేణులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

దాస సాహిత్య ప్రాజెక్టు శిక్షణ ప్రారంభం

సీటీఆర్ఐ: భగవంతునికి దాసుడిగా సేవ చేస్తూ జీవించడం అంటే మోక్షానికి చేరువ కావడమేనని దాస సాహిత్య ప్రాజెక్టు రాజమహేంద్రవరం శాఖ నిర్వాహకురాలు మంచిరాజు హేమలత అన్నారు. స్థానిక తిరుమల తిరుపతి దేవస్థానం కల్యాణం మండపంలో దాస సాహిత్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో సోమవారం దాస సాహిత్య వాగ్గేయ కారులు కీర్తనలలో శిక్షణ ప్రారంభమైంది. మూడు రోజుల పాటు ఈ కార్యక్రమం జరుగుతుంది. ఉదయం 9 గంటలకు ప్రార్థనలో మొదలైన ఈ కార్యక్రమంలో ప్రముఖ వాగ్గేయకారులు కీర్తనలను ఇక్కడికి వచ్చిన వారికి నేర్పిస్తున్నారు. 5వ తేదీన దాస సాహిత్య ప్రత్యేక అధికారి పగడాల ఆనంద తీర్థాచార్యులు విచ్చేసి ఆధ్యాత్మిక ప్రసంగం చేయనున్నారు.

ఫలితాలు తేలేది నేడే

- మొదట వెలువడేది కొవ్వూరు ఫలితమే
- లెక్కింపునకు పకడ్బందీ ఏర్పాట్లు
- సర్వత్రా ఉత్కంఠ

కొవ్వూరు: సార్వత్రిక ఎన్నికల ఫలితాలు మంగళవారం వెలువడనున్నాయి. జిల్లాలో వెలువడే తొలి ఫలితం కొవ్వూరు నియోజకవర్గానిదే. మధ్యాహ్నానికే అభ్యర్థుల భవితవ్యం తేలిపోనుంది. ఇరవై రోజులుగా అభ్యర్థులతో పాటు ఆయా పార్టీలశ్రేణులు ఫలితాల కోసం ఉత్కంఠగా ఎదురు చూస్తున్నాయి. విజయావకాశాలపై ఎవరికి వారే లెక్కలు వేసుకుంటున్నారు. మెజార్టీ జాతీయ, రాష్ట్ర మీడియా సంస్థల ఎగ్జిట్ పోల్స్‌లో రాష్ట్రంలో మరోసారి వైఎస్సార్ సీపీ అధికారంలోకి రానున్నట్టు స్పష్టం చేసిన విషయం తెలిసిందే. దాంతో టీడీపీ కూటమి నాయకుల మనసుల్లో గుబులు నెలకొంది. మరోపక్క ఎన్నికల ఫలితాలపై జోరుగా పందేలు నడుస్తున్నాయి. రాజమహేంద్రవరంలోని నన్నయ్య యూనివర్సిటీలో కొవ్వూరు అసెంబ్లీ నియోజకవర్గ ఓట్ల లెక్కింపు జరుగుతుంది. ఉదయం ఎనిమిదింటి నుంచే లెక్కింపు ప్రారంభం కానుంది. తొలుత పోస్టల్ ఓట్లు లెక్కించనున్నారు.

మహిళా ఓటర్లే కీలకం

కొవ్వూరు నియోజకవర్గంలో 1,84,136 మంది ఓటర్లు ఉంటే వారిలో 85.9 శాతం మంది అంటే 1,58,176 మంది ఓటు వేశారు. వారిలో పురుషుల కంటే మహిళలే 2,191 మంది అధికం. మహిళా ఓటింగ్ పెరగడం సర్వత్రా ఆసక్తిని రేకెత్తిస్తోంది.

ఎవరి లెక్కల వారివే

గ్రామాలు, కులాల వారీగా పోలైన ఓట్లలో ఎవరికి ఎన్ని ఓట్లు పడ్డాయన్న అంశంపై రాజకీయ పార్టీల నాయకులు లెక్కలు వేసుకుంటున్నారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థులు గెలుపుపై ధీమాతో ఉన్నారు. జనసేన, బీజేపీల బలం తోడు కావడంతో ఈసారి ఎలాగైన గెలుస్తామని టీడీపీ నేతలు అంచనా వేస్తున్నారు. ప్రధానంగా కాపు సామాజిక వర్గం ఓట్లు కీలకంగా మారాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రాధాన్యత కల్పిస్తుండడంతో ఆయా వర్గాల ఓట్లు తమకే అనుకూలమని వైఎస్సార్ సీపీ భావిస్తోంది. ఎస్సీల్లోని రెండు సామాజిక వర్గాల నుంచి ప్రధాన పార్టీ అభ్యర్థులు బరిలో ఉండడంతో ఆసక్తి కరంగా మారింది. ఎస్సీలంతా వైఎస్సార్ సీపీ సానుకూలంగా ఓటింగ్ చేయడంతో టీడీపీలో గుబులు మొదలైంది.

రూ.యాభై కోట్ల వరకూ బెట్టింగులు

నిడదవోలు, కొవ్వూరు, గోపాలపురం నియోజకవర్గాల్లో ప్రధాన పార్టీల అభ్యర్థుల గెలుపు, ఓటములపై భారీ ఎత్తున బెట్టింగులు సాగుతున్నాయి. ఇప్పటికే రూ.యాభై కోట్లకు పైగా పందేలు నడిచాయి. కొందరు గెలుపు, ఓటమిలపై వేస్తుంటే మరికొందరు మెజార్టీలపై పందేలు కాస్తున్నారు. తాజాగా ఎగ్జిట్ పోల్ సర్వేలు వెలువడడంతో ఈ పందేలు కాస్తా రెట్టింపు అయ్యాయి.



ఓట్ల లెక్కింపు ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ మాధవీలత, కౌంటింగ్ పరిశీలకుడు సుబ్రహ్మణ్యం

14 టేబుళ్ల ఏర్పాటు

సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు పరిశీలకుడు ఎం.సుబ్రహ్మంణ్యంతో కలిసి కలెక్టర్ కె.మాధవీలత ఓట్ల లెక్కింపు జరిగే రాజమహేంద్రవరం సమీపంలోని నన్నయ్య యూనివర్సిటీలో మూడు అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికల అధికారులతో కలిసి సోమవారం కౌంటింగ్ ఏర్పాట్లు పరిశీలించారు. కొవ్వూరులో ఈవీఎంల ద్వారా పోలైన ఓట్లు ఎన్ బ్లాక్ రెండో అంతస్తులో లెక్కిస్తారు. పార్లమెంట్ నియోజకవర్గం ఈవీఎం ఓట్ల లెక్కింపు కోసం 314 వ రూములో 14 టేబుల్స్ ఏర్పాటు చేశారు. కొవ్వూరు అసెంబ్లీ నియోజకవర్గ ఓట్ల లెక్కింపునకు 315, 316 రూమ్‌లలో 14 టేబుల్స్‌ను ఏర్పాటు చేశారు. పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపునకు నాలుగు టేబుల్స్ ఏర్పాటు చేసినట్టు కలెక్టర్ ప్రకటించారు. కొవ్వూరు రిటర్నింగ్ అధికారి అశుతోష్ శ్రీవాస్తవ, అదనపు ఎస్పీ ఎల్. చెంచురెడ్డి తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్

నిడదవోలు: స్థానిక అసెంబ్లీ సెగ్మెంట్ ఓట్ల లెక్కింపు మంగళవారం నన్నయ యూనివర్సిటీలో జరుగుతుంది. ఎన్టీఆర్ కన్వెన్షన్ సెంటర్ దిగువ అంతస్తులోని రూమ్ నంబర్ సీసీ 101ఏ లో నిడదవోలు అసెంబ్లీ పరిధిలోని లోక్‌సభ ఓట్లను లెక్కిస్తారు. అలాగే అక్కడకు సమీపంలోని సీసీ 108 ఏ రూమ్‌లో అసెంబ్లీ సెగ్మెంట్ ఓట్లను లెక్కిస్తారు. ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభిస్తారు. నియోజకవర్గంలోని 12 మంది అభ్యర్థులు ఎన్నికల్లో నిలబడ్డారు. ప్రధానంగా పోటీ వైఎస్సార్ సీపీ అభ్యర్థి జి. శ్రీనివాస్‌నాయుడు, జనసేన అభ్యర్థి కందుల దుర్గేష్‌ల మధ్యే నెలకొంది.



నన్నయలో నిడదవోలు ఓట్ల లెక్కింపు ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ మాధవీలత, పరిశీలకుడు

15 రౌండ్లలో లెక్కింపు

నియోజకవర్గంలోని మొత్తం 205 పోలింగ్ బూత్‌ల పరిధిలో పోలైన ఓట్లను 15 రౌండ్లలో లెక్కిస్తారు. ఓట్ల లెక్కింపు కోసం పార్లమెంట్‌కు 14, అసెంబ్లీ నియోజకవర్గానికి 14 టేబుల్స్ ఏర్పాటు చేశారు. పోస్టల్ బ్యాలెట్ కోసం మరో మూడు టేబుల్స్ ఏర్పాటు చేశారు. ఉదయం 8 గంటలకు మొదటి పోస్టల్ బ్యాలెట్‌ను లెక్కిస్తారు. ఉదయం 8.30 గంటల నుంచి ఈవీఎంలను తెరిచి లెక్కిస్తారు. నియోజకవర్గంలో 2,13,396 ఓట్లు ఉండగా 1,80,688 ఓట్లు పోలయ్యాయి. పోస్టల్ బ్యాలెట్ 2013 ఓట్లు ఉన్నాయి. మొత్తం 1,82,701 ఓట్లను లెక్కించనున్నారు. కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లను కలెక్టర్ మాధవీలత, పరిశీలకుడు కమల్‌కాంత్ సరోచ్, నిడదవోలు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆర్. వెంకటరమణ నాయక్ పరిశీలించారు.

4 గంటలకు గోపాలపురం ఫలితం

- నన్నయ యూనివర్సిటీలో ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధం
- కౌంటింగ్ ఏజెంట్ల నియామకం
- గ్రామాల్లో గట్టి పోలీసు బందోబస్తు

దేవరపల్లి: గోపాలపురం నియోజకవర్గ ఓటర్ల తీర్పు మంగళవారం వెలువడనుంది. గత నెల 13న సార్వత్రిక ఎన్నికల పోలింగ్ జరిగింది. ఓటర్ల తీర్పు నిక్షిప్తమైన ఈవీఎంలను రాజమహేంద్రవరం సమీపంలోని నన్నయ యూనివర్సిటీలో అధికారులు భద్రపరిచారు. ఈవీఎంలను తెరచి మంగళవారం ఉదయం 8 గంటల నుంచి ఓట్లను లెక్కించనున్నారు. ఇందుకోసం యూనివర్సిటీలోని కౌంటింగ్ కేంద్రంలో కలెక్టర్ కె. మాధవీలత పర్యవేక్షణలో ఏర్పాట్లు చేశారు.

ఇదీ పరిస్థితి

నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 2,42,763 మంది ఓటర్లు ఉండగా, వారిలో 2,10,399 మంది ఓటు వేశారు. ఓటర్ల తీర్పు వెలువడడానికి కొన్ని గంటలే సమయంలో ఉండడంతో విజయం ఎవరిని వరిస్తుందోనని ప్రజలు ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. వైఎస్సార్ సీపీ, టీడీపీ కూటమి నాయకులు విజయోత్సవ వేడుకలకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. కౌంటింగ్ అనంతరం ఫలితాలు ప్రకటించాక గ్రామాల్లో అల్లర్లు జరగకుండా గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. నాలుగు మండలాల్లో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన 83 మంది నాయకులు, కార్యకర్తలపై బైండోవర్ కేసులు నమోదు చేశారు. ఈ కేసులు నమోదైన వారు రెండు రోజుల పాటు పోలీసుల అదుపులో ఉండాలి. ఒక్కొక్క మండలంలో 60 నుంచి 80 మంది పోలీసు సిబ్బంది, ప్రత్యేక భద్రతా దళాలతో భద్రత ఏర్పాటు చేసినట్టు పోలీసు అధికారులు తెలిపారు. నియోజకవర్గంలోని మండలాలవారీగా దేవరపల్లిలో 4, గోపాలపురంలో 4, నల్లజర్లలో 9 పోలీసు పికెట్లు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే అభ్యర్థుల ఇళ్ల వద్ద, పార్టీల ఆఫీసుల వద్ద పోలీసు బందోబస్తు పెట్టారు. నియోజకవర్గంలోని 57 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో ఎస్సై, సీఐ స్థాయి అధికారి పర్యవేక్షణ ఉంటుందని అధికారులు తెలిపారు.



నన్నయ వర్సిటీలో గోపాలపురం నియోజకవర్గ ఓట్ల లెక్కింపునకు ఏర్పాటు చేసిన టేబుళ్లు

14 టేబుళ్లు..18 రౌండ్లు

గోపాలపురం నియోజకవర్గంలో పోలైన ఓట్ల లెక్కింపునకు కౌంటింగ్ కేంద్రంలో 14 టేబుళ్లు ఏర్పాటు చేశారు. 18 రౌండ్లలో లెక్కింపు జరుగుతుంది. నియోజకవర్గంలో 248 పోలింగ్ కేంద్రాలు ఉండగా, ప్రతి రౌండులోనూ 14 పోలింగ్ కేంద్రాల ఓట్ల లెక్కింపు జరుగుతుంది. ఈ విధంగా 17 రౌండ్లలో 238 పోలింగ్ కేంద్రాల ఓట్ల లెక్కింపు పూర్తి కాగా, 18వ రౌండ్‌లో 14 టేబుళ్లపై 10 పోలింగ్ కేంద్రాల ఓట్ల లెక్కింపు జరుగుతుంది. కౌంటింగ్ ప్రక్రియ సజావుగా సాగితే సాయంత్రం 4 గంటలకు ఫలితం వెలువడే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

86.3 శాతం పోలింగ్

నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 248 పోలింగ్ కేంద్రాల్లో 86.3 శాతం పోలింగ్ నమోదైంది. నియోజకవర్గంలో 2,42,763 మంది ఓటర్లు ఉండగా, ఈవీఎంల ద్వారా 2,06,594 ఓట్లు, పోస్టల్ బ్యాలెట్ ద్వారా 1577 పోలైనట్టు అధికారులు తెలిపారు. మొత్తం 2,08,171 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. వీరిలో పురుషులు ఎక్కువ మంది ఉన్నారు. పురుషులు 1,03,945 మంది (87.37 శాతం), స్త్రీలు 1,04,900 మంది (84.74 శాతం) ఓటు వేశారు.

వైద్య ఖర్చులకు రూ.10 వేల సాయం



వృద్ధ దంపతులకు ఆర్థిక సాయం అందిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ

నిడదవోలు: స్థానిక రాయపేటకు చెందిన వృద్ధ, పేద దంపతులు చంగల్వల సుబ్బారావు, కమలల వైద్యానికి రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు శాఖ ఆధ్వర్యంలో సోమవారం రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. ప్రవాస భారతీయుడైన చెన్నా శ్రీనివాసరావు, నాగమణి దంపతుల పంపించిన ఆర్థిక సాయాన్ని మునిసిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ చేతుల మీదుగా ఆ దంపతులకు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కీర్తి ఆంజనేయులు, గొన్నాబత్తుల రామారావు, నందకిషోర్, భాగ్యలక్ష్మి, పొన్నా సుబ్రహ్మణ్య శర్మ తదితరులు పాల్గొన్నారు.

మండల సమావేశంలో సమస్యల ప్రస్తావన

చాగల్లు: స్థానిక ఎంపీపీ ఎం.వీరాస్వామి అధ్యక్షతన సోమవారం నిర్వహించిన చాగల్లు మండల పరిషత్ పాలకవర్గ సర్వసభ్య సమావేశంలో సభ్యులు పలు ప్రజా సమస్యలు లేవ నెత్తారు. ఎంపీడీవో ఎస్.బుజ్జి మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య పనుల నిర్వహణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకున్నామని ఆమె చెప్పారు. డీఎంఎఫ్ నిధులతో చేపట్టిన పనులు ఇంత వరకూ ఏడు గ్రామాల్లో పూర్తయ్యాయని పంచాయతీరాజ్ ఇన్‌చార్జ్ ఏఈ పి.రవీంద్ర చెప్పారు. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత మిగిలిన గ్రామాల్లో ఈ పనులు నిర్వహిస్తామని బ్రాహ్మణగూడెం ఎంపీటీసీ సభ్యుడు ప్రత్తిపాటి వెంకటేశ్వరరావు అడిగిన ప్రశ్నకు రవీంద్ర సమాధానంగా చెప్పారు. కొత్తగా ఉద్యాన పంటలు సాగు చేసే రైతులను గ్రామస్థాయిలో గుర్తిస్తున్నామని ఉపాధి హామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్ పి.భాస్కర్ సమావేశంలో ప్రకటించారు. ఈ పనులను ఉపాధి కూలీలను జత చేస్తామని చెప్పారు. తమ ప్రాంతంలో విద్యుత్తు సమస్యలు పరిష్కరించాలని చాగల్లు–4 ఎంపీటీసీ సభ్యురాలు ఇంటి బాలవెంకట కృష్ణవేణి అధికారుల దృష్టికి తీసుకు వచ్చారు.అలాగే నాడు- నేడు పథకంలో చాగల్లు జీఆర్‌బీ స్కూల్లో చేపట్టిన అభివృద్ధి పనుల వివరాల గురించి కూడా ఆమె ధికారులను అడిగారు. నందిగంపాడులో కొత్తగా గృహాలు నిర్మించుకున్న వారికి మరుగుదొడ్ల నిర్మాణ బిల్లుల విడుదలలో జాప్యం జరిగిందని ఆ పంచాయతీ సర్పంచ్ కుదప రాంబాబు సమావేశం దృష్టికి తీసుకు వచ్చారు. సమావేశంలో మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు చెల్లింకుల శ్రీవిజయ, ఎంపీటీసీ సభ్యులు ఆత్కూరి గోపీచంద్, పిల్లి తిరుమలరావు, ఎస్‌కే పాషా, ఉన్నమట్ల విజయకుమారి, ఉసురుమర్తి జ్యోతి, ముళ్లపూడి గంగాభవాని, పలువురు మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



సమావేశంలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇస్తున్న అధికారి

విజయోత్సవాలు, సంబరాలపై నిషేధం

- అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) రాజశేఖరరాజు
- పలు గ్రామాల్లో పోలీసులతో ఫ్లాగ్ మార్చ్

నల్లజర్ల: మంగళవారం సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు జరగనున్న నేపథ్యంలో పోలీసులు భద్రతా ఏర్పాట్లను మరింత కట్టుదిట్టం చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా గట్టి నిఘా పెట్టారు. జిల్లా ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) ఎస్ఆర్ రాజశేఖరరాజు సోమవారం సాయంత్రం నల్లజర్ల మండలంలో వివిధ సమస్యాత్మక గ్రామాల్లో సిబ్బందితో కలసి ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. మంగళవారం ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకూ తూర్పు గోదావరి జిల్లా అంతటా 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఆయన చెప్పారు. నలుగురికి మించి ఎక్కువ మంది ఒక చోట గుమికూడరాదన్నారు. ఎవరైనా అల్లర్లు, హింసాత్మక ఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల ఫలితాల అనంతరం బాణసంచా కాల్చులు, ఊరేగింపులు, ర్యాలీల నిర్వహణకు అనుమతులు లేవన్నారు. యువత బైక్‌ల సైరన్‌లు తీసి అధిక స్పీడుతో వెళ్లి అలజడలు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి ఒక్కరూ వివాదాలకు దూరంగా ఉండాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని రాజశేఖరరాజు చెప్పారు. జూన్ 6 వరకూ ఎన్నికల కోడ్ అమలులో ఉందన్నారు. ఆయనతో పాటు ఇన్‌చార్జ్ డీఎస్పీ శ్రీనివాసమూర్తి, సీఐ దుర్గాప్రసాద్, ఎస్ఐ వెంకట సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.



నల్లజర్లలో పోలీసు అధికారులతో మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ రాజశేఖరరాజు

కవ్వింపు చర్యలకు పాల్పడ్డారో?

గోపాలపురం: మంగళవారం సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు నేపథ్యంలో ఎవరైనా అసాంఘిక ఘటనలకు పాల్పడినా, కవ్వింపు చర్యలు దిగినా చట్టపరమైన చర్యలు ఉంటాయని గోపాలపురం ఎస్సై కర్రి సతీష్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల్లో గెలిచినా, ఓడినా భావోద్వేగాలను అదుపులో ఉంచుకోవాలన్నారు. ఈ నెల 6వ తేదీ వరకూ ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందన్నారు. కౌంటింగ్ సందర్భంగా గ్రామాల్లో ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినా తీవ్ర చర్యలు ఉంటాయన్నారు. బెట్టింగులు, ఊరేగింపులు, సంబరాలు నిషిద్ధం అన్నారు.

నిడదవోలు రూరల్: మండలంలో 144 సెక్షన్‌ను పటిష్టంగా అమలు చేస్తున్నామని సమిశ్రగూడెం ఎస్సై రమేష్ సోమవారం తెలిపారు. మంగళవారం సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు నేపథ్యంలో ఎన్నికల సంఘం, పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు పలు గ్రామాల్లో గస్తీ నిర్వహిస్తున్నామన్నారు.

గ్రంథాలయాల డిజిటలైజేషన్‌కు సన్నాహాలు

- ఉమ్మడి 'పశ్చిమ' జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి శేఖర్ బాబు
- ముక్కామల, పెరవలి గ్రంథాలయాల సందర్శన

పెరవలి: అందరికీ సాంకేతిక విద్య అందించాలనే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా గ్రంథాలయాల డిజిటలైజేషన్‌కు సన్నాహాలు చేస్తున్నామని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం. శేఖర్‌బాబు అన్నారు. మండలంలోని ముక్కామల, పెరవలి శాఖా గ్రంథాలయాల్లో విద్యార్థులకు నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాలకు సోమవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు ఆయన పలు ప్రశ్నలు వేసి ఏ విధంగా శిక్షణ ఇస్తున్నారు? శిక్షణలో వారు నేర్చుకున్నదేమిటి అని తెలుసుకుని సంతృప్తి చెందారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 74 శాఖా గ్రంథాలయాల్లో ఇప్పటికే కంపూటర్లు ఏర్పాటు చేశామన్నారు. జరిగిందన్నారు. వాటిని తమకు అవసరం మేరకు విద్యార్థులు వినియోగించుకుంటున్నారని చెప్పారు. జిల్లాలో శిథిలమైన శాఖా గ్రంథాలయ భవనాల మరమ్మతులకు నిధులు మంజూరు చేస్తామని ప్రకటించారు. అలాగే గ్రంథాలయాలకు కొత్త పుస్తకాలను కొనుగోలు చేశామని చెప్పారు. జిల్లాలో పుస్తక నిక్షిప్త కేంద్రాలు 95 ఉన్నాయని, వాటిని పెంచేందుకు చర్యలు చేపడతామన్నారు. వేసవి శిక్షణలో విశేష ప్రతిభ కనబరిచిన విద్యార్థుల మెడలో శేఖర్‌బాబు మెడల్స్ వేసి అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.వెంకటేశ్వర్లు, ప్రసాద్, యోగా గురువు కరుటూరి విశ్వనాథం, సలాది సూర్యనారాయణ, రిసోర్స్‌పర్సన్ ఎ దుర్గాభవాని, లైబ్రేరియన్లు యు. వెంకటేశ్వర్లు , ఎం. వేంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరంలో భాగంగా సోమవారం తాళ్లపూడి శాఖా గ్రంథాలయంలో విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. బి. పవన్ అనే విద్యార్థి హాస్య కథలు అనే తెలుగు పుస్తకాన్ని, రఫీ అనే మరో విద్యార్థి చిల్డ్రన్ స్టోరీ బుక్స్, మహాభారత అనే ఇంగ్లిష్ స్టోరీని చదివి వినిపించారు. అనంతరం తాళ్లపూడి వెటర్నరీ అసిస్టెంట్ డి. వెంకటరమణ పశువులు, వాటి రక్షణ గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ఎ. సరేష్ తదితరులు పాల్గొన్నారు.



ముక్కామలలో మాట్లాడుతున్న ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి శేఖర్‌బాబు



నల్లజర్ల శాఖా గ్రంథాలయంలో విద్యార్థులతో మాట్లాడుతున్న రిటైర్డు ఇంజినీర్ కాన్ బాజీ

పుస్తక పఠనంపై అవగాహన అవసరం

నల్లజర్ల: పుస్తక పఠనంపై విద్యార్థులకు అవగాహన అవసరమని రిటైర్డ్ ఇంజినీర్ ఎస్‌కే కాన్‌బాజీ అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు సోమవారం పుస్తక పఠనం ఆవశ్యకతను ఆయన వివరించారు. కాన్‌బాజీ మాట్లాడుతూ విద్యార్థులు క్రమం తప్పకుండా గ్రంథాలయాలకు వెళ్లి బాల సాహిత్యం, నీతికథలు, పంచతంత్రం, శతక పద్యాలు, విజ్ఞాన విషయాలు వంటి పుస్తకాలు చదవాలన్నారు. దీనిల్ల పుస్తక పఠనంపై ఆసక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ఏవీ రమణ పాల్గొన్నారు.అనంతరం విద్యార్థులు చిత్రలేఖనం, క్విజ్, మ్యాథ్స్ అంశాలు వివరించారు.



తాళ్లపూడి శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

చాగల్లులో ర్యాలీ

చాగల్లు: వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా స్థానిక గ్రంథాలయం ఆధ్వర్యంలో సోమవారం చాగల్లులో విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆ గ్రంథాలయాధికారి గద్దె శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ శిక్షణ తరగతుల్లో విద్యార్థులకు కథలు చెప్పామని, పుస్తక పఠనం చేయించామని, కంప్యూటర్ నేర్పించామన్నారు. అలాగే పాటలు, డ్రాయింగ్, వ్యాసరచన వంటి పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. విజేతలకు ప్రశాంస పత్రాలు, బహుమతులు ఇస్తామని శ్రీనివాసరావు తెలిపారు.

శ్రీ విశ్వేశ్వరస్వామి వారి దేవస్థానము,
భూమి సేద్యపు బహిరంగ వేలం ప్రకటన

[illegible]

[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
1	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]

[illegible]
కార్యనిర్వహణాధికారి

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నిడదవోలు డివిజన్
90102 34548 (కొవ్వూరు)
90100 51493 (నిడదవోలు)
90100 68395 (గోపాలపురం)
Office mail : tpgadvt@gmail.com